సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
11-02-2025
పేజీలు: 02




## నేడు వరంగల్‌కు రాహుల్ గాంధీ

నేడు తెలంగాణకు రాహుల్ గాంధీ రానున్నారు. సాయంత్రం 5.30 గంటలకు శంషాబాద్ చేరుకోనున్న రాహుల్.. చాపర్‌లో వరంగల్ చేరుకోనున్న రాహుల్.. వరంగల్ సుప్రభా హోటల్‌లో కాసేపు విశ్రాంతి తీసుకోనున్నారు. 7:30కి వరంగల్ నుంచి రైలులో చెన్నై వెళ్లనున్నారు. కాగా, బీసీ కుల గణన అంశంలో ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోందని ప్రభుత్వం చెబుతోంది. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రజల స్పందనను రాహుల్ తెలుసుకోనున్నారు. రైల్వే ప్రైవేటీకరణ అంశంపై రైలు ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు.



## ప్రభుత్వం పనితీరును చూసి ఓట్లు వెయ్యండి

గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం గుడ్లవల్లేరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంజనీరింగ్, డిప్లమో కళాశాలల అధ్యాపకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ గుడ్లవల్లేరు మండల కార్యాలయంలో ముఖ్యనాయకులు, బూత్ కమిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలోని 1,400 మంది ఓట్లర్లను కలిసి కూటమి ప్రభుత్వం పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించి పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వేసేలా పనిచేయాలని ఆయన కోరారు. అనంతరం కౌతవరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వల్లభనేని బాబూరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జంగం మోహనరావు, టీడీపీ గుడివా డ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, అడుసుమిల్లి రామ్మోహనరావు, డీసీ చైర్మన్ పాలేటి వీరాంజనేయులు, నీటి సంఘాల అధ్యక్షులు చలసాని శ్రీధర్, కరీం, తూము పద్మజ, పాల్గొన్నారు.



# ఢిల్లీకి మహిళా సీఎం?

నలుగురు మహిళల్లో చాన్స్ ఎవరికో? మహిళలు, దళితులకు కేబినెట్లో పెద్దపీట ఢిల్లీకి మరోసారి మహిళే ముఖ్యమంత్రి కానున్నారా? బీజేపీ అధిష్టానం ఆ దిశగానే ఆలోచిస్తున్నట్టుగా సంకేతాలు వెలువడుతున్నాయి. అత్యున్నత వర్గాలను ఉటంకిస్తూ పార్టీ వర్గాలు కూడా అదే చెబుతున్నాయి. కాబోయే సీఎం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లోంచే ఎంపికవుతారని కూడా తెలుస్తోంది. పార్టీలో పలువురు నేతల అభిప్రాయం కూడా అదే కావడంతో ఈ విషయంలో అధిష్టానం రెండో ఆలోచన చేయకపోవచ్చంటున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను బీజేపీ ఓడించడం తెలిసిందే. తద్వారా ఢిల్లీలో 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. బీజేపీ తరఫున నలుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. సీఎం పదవికి మహిళనే ఎంచుకుకోవాలని పార్టీ నిర్ణయిస్తే వారిలో ఎవరికి అదృష్టం దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అంతేగాక వెనకవబడ్డ వర్గాల నుంచి ఒకరిని ఉప ముఖ్యమంత్రిని కూడా చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. మహిళలకు, దళితులు, ఇతర వెనకబడ్డ వర్గాలకు మంత్రివర్గ కూర్పులో కూడా అధిక ప్రాధాన్యం దక్కడం ఖాయమంటున్నారు. ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియపై పార్టీ పెద్దలు ఇప్పటికే దృష్టి పెట్టారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే పలుమార్లు సమావేశమై దీనిపై చర్చించారు. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంలో ఆప్ సారథి అరవింద్ కేజ్రీవాల్‌పై సంచలన విజయం సాధించిన బీజేపీ నేత పర్వేశ్ వర్మ సీఎం రేసులో ముందున్నారంటూ రెండు రోజులుగా వార్తలు వస్తుండటం తెలిసిందే. ఆయన మాజీ సీఎం కుమారుడు. పర్వేశ్ తండ్రి సాహిబ్‌సింగ్ వర్మ బీజేపీ తరఫున ఢిల్లీ సీఎంగా పని చేశారు. పర్వేశ్‌తో పాటు వీరేంద్ర గుప్తా, సతీశ్ ఉపాధ్యాయ, ఆశిష్ సూద్, పవన్ వర్మ తదితరుల పేర్లు కూడా చక్కర్లు కొడుతున్న తరుణంలో తాజాగా అనూహ్యంగా మహిళా సీఎం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. నాలుగు రోజుల విదేశీ పర్యటన ముగించుకుని ప్రధాని నరేంద్ర మోదీ 13న తిరిగి రానున్నారు. సీఎం అభ్యర్థిపై ఆ తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. బహుశా 15వ తేదీకల్లా దీనిపై స్పష్టత వస్తుందంటున్నారు. బీజేపీ నుంచి నలుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. షాలిమార్‌బాగ్ స్థానం నుంచి రేఖా గుప్తా, నజఫ్‌గఢ్ నుంచి నీలం పెహల్వాన్ 29 వేల పై చిలుకు మెజారిటీతో నెగ్గారు. గ్రేటర్ కైలాష్ నుంచి శిఖా రాయ్ 3,188 ఓట్ల మెజారిటీతో ప్రముఖ ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్‌పై నెగ్గారు. వాజీపూర్ నుంచి పూనం శర్మ కూడా 11 వేల పై చిలుకు మెజారిటీతో విజయం సాధించారు. ఢిల్లీకి ఇప్పటిదాకా ముగ్గురు మహిళలు సీఎంలయ్యారు. వారిలో తొలి వ్యక్తిగా బీజేపీ నేత సుష్మా స్వరాజ్ నిలిచారు. 1998లో ఆమె సీఎం పగ్గాలు చేపట్టారు. అయితే కేవలం 52 రోజులు మాత్రమే పదవిలో కొనసాగారు. ఆమె తర్వాత కాంగ్రెస్ నేత షీలా దీక్షిత్ రూపంలో రెండో మహిళ ఢిల్లీ గద్దెనెక్కారు. ఆమె 2013 దాకా ఏకంగా 15 ఏళ్ల పాటు సీఎంగా కొనసాగడం విశేషం. అనంతరం ఆప్ నుంచి తాజాగా ఆతిశీ రూపంలో మూడో మహిళ ఢిల్లీ సీఎం అయ్యారు. ఆమె కేవలం నాలుగున్నర నెలల పాటు పదవిలో కొనసాగారు.



## 'తండేల్'కు సాలిడ్ బుకింగ్స్

అక్కినేని నాగచైతన్య నటించిన లేటెస్ట్ మూవీ 'తండేల్' ఇటీవల రిలీజ్ అయ్యి బాక్సాఫీస్ దగ్గర సందడి చేస్తుంది. దర్శకుడు చందూ మొండేటి డైరెక్ట్ చేసిన ఈ లవ్ స్టోరీ చిత్రం పాజిటివ్ రెస్పాన్స్‌తో బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతుంది. ఇక ప్రేక్షకులు అందించిన రెస్పాన్స్‌కు చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేస్తుంది. అయితే, ఈ సినిమా ఫస్ట్ వీకెండ్‌లో మంచి కలెక్షన్స్ రాబట్టింది. దీంతో సోమవారం రోజున ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ రాబడుతుందా అని అందరూ ఆసక్తిగా చూశారు. కీలకమైన మండే టెస్ట్‌లో కూడా 'తండేల్' పాస్ అయ్యింది. దీనికి బుక్ మై షో లో టికెట్ బుకింగ్స్ చూస్తే అర్థమవుతుంది. సోమవారం రోజు ఈ చిత్రానికి బుక్ మై షోలో ఏకంగా 73 వేలకు పైగా టికెట్లు బుక్ అయినట్లు మేకర్స్ తెలిపారు. దీన్నిబట్టి ఈ సినిమాకు సోమవారం కూడా సాలిడ్ వసూళ్లు రావడం ఖాయమని స్పష్టమవుతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ సాయి పల్లవి హీరోయిన్‌గా నటించగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో ఈ చిత్రాన్ని బన్నీ వాస్ ప్రొడ్యూస్ చేశారు.



## చికెన్ తినొద్దని తెలంగాణ ప్రభుత్వం వార్నింగ్

తెలంగాణ ప్రభుత్వం మంగళవారం కీలక హెచ్చరికలు జారీచేసింది. రాష్ట్రంలోని ప్రజలు కొన్ని రోజులు చికెన్ తినవద్దని హెచ్చరించింది. కోళ్లకు సోకుతున్న వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే ఈ వ్యాధి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు వ్యాపించినందున.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తణుకు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమడోలు, కొల్లేరు కాకినాడ, ఏలూరులో కోళ్లు చనిపోవడంతో.. కోళ్ల రక్త నమూనాలు తీసి భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపారు పశుసంవర్ధకశాఖ అధికారులు. 15 రోజులుగా వణికిస్తున్న వైరస్ ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా H5N1 అని భోపాల్‌లోని యానిమల్ డిసీజెస్ ల్యాబ్ తేల్చింది. తణుకు మండలం వేల్పూరు, పెరవలి మండలం కానూరు గ్రామాల్లో చనిపోయిన కోళ్లకు హెచ్5ఎన్1 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో_ _ _ చికెన్ తినొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో ఏపీలో చికెన్ తినే వారి సంఖ్య తగ్గింది. దీంతో రేట్లు కూడా తగ్గిపోయాయి.

## స్టాక్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసం



స్టాక్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసగాళ్ళు ఒక రిటైర్డ్ ఉద్యోగిని రూ.21 లక్షలు మోసం చేశారు.పోలీసుల ప్రకారం, 73 ఏళ్ల వ్యక్తికి ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీ అయిన 'షేర్‌ఖాన్' నుండి వచ్చినట్లు చెప్పుకునే గుర్తు తెలియని వ్యక్తి నుండి సందేశం వచ్చింది. ఎగ్జిక్యూటివ్ సూచన మేరకు, ఆ వ్యక్తి ట్రేడింగ్ ఖాతాను తెరిచి, షేర్లను కొనుగోలు చేయడానికి మోసగాళ్ళు అందించిన బ్యాంక్ ఖాతాకు రూ.50,000 బదిలీ చేశాడు. అయితే, బాధితుడు దానిలో నష్టపోయాడు."మోసగాడు ఆ వ్యక్తిని వేరే కంపెనీ షేర్లను కొనుగోలు చేయమని అడిగాడు, మరియు మోసగాడిని నమ్మి, అతను రూ.21 లక్షలను బ్యాంకు ఖాతాకు బదిలీ చేశాడు. బాధితుడి ట్రేడింగ్ ఖాతాలో రూ.22.50 లక్షల బ్యాలెన్స్ కనిపించినప్పటికీ, అతను ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేయలేకపోయాడు. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవడానికి వీలుగా మరిన్ని మొత్తాలను బదిలీ చేయమని మోసగాళ్ళు ఆ వ్యక్తిని కోరారు, "అని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు.ఆ వ్యక్తికి అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించారు, వారు మోసగాళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# త్వరలో భారత్ తొలి హైడ్రోజన్ రైలు

భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా ఇప్పటికే వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. అలాగే, స్లీపర్‌తో పాటు వందే భారత్ మెట్రోను సైతం తీసుకురాబోతున్నది. సరికొత్తగా హైడ్రోజన్ రైళ్లపై సైతం దృష్టి సారించింది. తొలిసారిగా హైడ్రోజన్ రైలును తీసుకురాబోతున్నది. ఈ రైలు ప్రత్యేకతలు, ఫీచర్స్‌ను కేంద్ర రైల్వేశాఖ మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న హైడ్రోజన్ రైళ్ల ఇంజిన్లు 500 నుంచి 600 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుండగా.. భారత రైల్వేల హైడ్రోజన్ రైలు మాత్రం 1200 హార్స్‌పవర్ వరకు శక్తిని ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. అంతే కాకుండా ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత పొడవుగా ఉంటుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభలో ప్రకటించారు. రైలు పొడవుతో పాటు సాంకేతికంగా బాగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. భారత్ మొట్టమొదటి హైడ్రోజన్ రైలును పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ రేక్‌లపై హైడ్రోజన్ ఇంధన కణాల రెట్రోఫిట్మెంట్ ద్వారా ఈ రైలును తయారు చేస్తున్నారు. రైల్వే రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ స్పెసిఫికేషన్లను సిద్ధం చేసింది. హైడ్రోజన్ రైలు స్టేటస్‌పై ఎంపీ అజిత్ కుమార్ భూయాన్ అడిగిన ప్రశ్నకు ఆయన రైల్వే మంత్రి సమాధానం ఇచ్చారు. రైలుతో పాటు హైడ్రోజన్‌ను తిరిగి నింపేందుకు ఇంటిగ్రేటెడ్ హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, పంపిణీ సౌకర్యాన్ని



రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన ఆమోదం కోసం పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ ను అభ్యర్థించినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు భారతీయ రైల్వే తీసుకున్న కీలకమైన చొరవ అని పేర్కొన్నారు. ఇప్పటివరకు కేవలం నాలుగు దేశాలు మాత్రమే హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించాయి.



## మాల్వి హాట్ షో..

'తిరగబడరా సామి' సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది నార్త్ బ్యూటీ మాల్వి మల్హోత్రా. మూవీ రిలీజ్ కు ముందే రాజ్ తరుణ్ వివాదంతో ట్రెండింగ్ లో నిలిచింది. ఇంతకీ ఈ మాల్వి ఎవరో తెలుసా?మాల్వి తొలి తెలుగు సినిమా విడుదలకాక ముందే రాజ్ తరణ్ వివాదంతో ఆమె పేరు వార్తల్లోకి వచ్చింది. ఆమె కారణంగా రాజ్ తరుణ్ తనకు దూరం అయ్యాడని అతడి గర్ల్ ఫ్రెండ్ లావణ్య ఆరోపించింది. అంతేకాదు, రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం ఇండస్ట్రీలో సంచలనం కలిగించింది.మాల్వి మల్హోత్రా హిమాచల్ ప్రదేశ్ లోని మండిలో జన్మించింది. పంజాబీ కుటుంబానికి చెందిన మాల్వి చండీగఢ్ లోనే చదివింది. యూనివర్సిటీ ఆఫ్ ముంబైలో మాస్టర్స్ చేసింది. యాక్టింగ్ మీద ఉన్న ఇష్టంతో టీవీ పరిశ్రమలోకి అడుగు పెట్టింది. 2017లో 'ఉడాన్' అనే సీరియల్ లో కనిపించింది.'హోటల్ మిలన్' అనే సినిమాతో సిల్వర్ స్క్రీన్ మీద దర్శనం ఇచ్చింది. ఈ సినిమా అనుకున్న స్థాయిలో సక్సెస్ కాలేదు. ఆ తర్వాత షార్ట్ ఫిలిమ్స్, ఓటీటీ చిత్రాల్లో నటించినా అనుకున్న స్థాయిలో గుర్తింపు రాలేదు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## కుంభమేళాలో సోనాల్ చౌహాన్

ఎక్కడ చూసినా కుంభమేళా గురించే చర్చించుకుంటున్నారనడంలో అతిశయోక్తి లేదు. ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభమైన ఈ వేడుక ఫిబ్రవరి 26 వరకు జరగనుంది.అయితే 144 సంవత్సరాలకు ఒక్కసారి జరిగే ఈ మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. కేవలం సామాన్యులే కాదు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు కూడా మహా కుంభమేళాలో భాగమవుతున్నారు. ప్రధానంగా సినీ తారలు పెద్ద ఎత్తున కుంభమేళా వేడుకలో భాగమవుతున్నారు. తాజాగా ప్రముఖ హీరోయిన్ సోనాల్ చౌహాన్ మహాకుంభమేళాను దర్శించుకుంది. సంప్రదాయ దుస్తులు ధరించి త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించింది. ఈ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీంతో అవి కొద్ది క్షణాల్లోనే వైరల్ గా మారాయి. అయితే ఆమె మెడలో మాలకు సంబంధించిన దండ కనిపించడంతో అంతా షాక్ అవుతున్నారు.కాగా, సోనాల్ చౌహాన్ రెయిన్ బో సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయమైన అమ్మడు లెజెండ్, డిక్టేటర , రూలర్ మూవీల్లో బాలకృష్ణ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుని ఫుల్ పాపులారిటీ తెచ్చుకుంది.

## అయోధ్య రామాలయ దర్శన వేళల్లో మార్పులు



ఉత్తరప్రదేశ్ ప్రస్తుతం హిందూ భక్తులతో కిటకిటలాడుతున్నది. మహాకుంభ్‌లో పుణ్యస్నానాల కోసం వెళ్తున్న ప్రజలు.. అయోధ్య, కాశీ విశ్వనాథ్ ఆలయాలను కూడా దర్శించుకుంటున్నారు. అయితే ప్రతి రోజు లక్షలాది సంఖ్యలో ఈ రెండు ఆలయాలను భక్తులు సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో అయోధ్యలోని కొత్తగా నిర్మించిన రామాలయ దర్శన వేళల్లో మార్పులు చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు దీనిపై ప్రకటన చేసింది. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆలయాన్ని భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచనున్నట్లు ఆలయ ట్రస్టు పేర్కొన్నది. మొన్నటి వరకు ఆలయాన్ని ఉదయం 7 గంటలకు తెరిచేవారు. ఇప్పుడు ఓ గంట ముందు సాధారణ ప్రజల దర్శనం కోసం తెరుస్తున్నారు. దర్శన సమయంలో మార్పులతో పాటు హారతి షెడ్యూల్‌ను కూడా మార్చారు. మొన్నటి వరకు మంగళహారతి ఉదయం 4.30 నిమిషాలకు జరిగేది. ఇప్పుడు మంగళ హారతిని ఉదయం 4 గంటలకే నిర్వహించనున్నారు. అయితే హారతి కోసం టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. 15 రోజుల ముందే ఆ టికెట్లు ఇస్తారు. ఉదయం 4 గంటల హారతి తర్వాత ఆలయాన్ని కొంత సేపు మూసివేస్తారు. ఆ తర్వాత ఉదయం ఆరు గంటలకు శ్రింగార హారతి ఇస్తారు. ఆ హారతితో సాధారణ ప్రజల దర్శనం కోసం ఆలయాన్ని తెరిచి ఉంచుతారు. రామ్‌లల్లాకు మధ్యాహ్నం 12 గంటలకు రాజ్‌భోగ్‌ను సమర్పించనున్నట్లు ఆలయ ట్రస్టు పేర్కొన్నది. అయితే ఆ సమయంలో భక్తలను దర్శనం కోసం అనుమతిస్తారు. రాత్రి ఏడు గంటలకు సంధ్యా హారతి ఇవ్వనున్నారు. ఆ టైంలో 15 నిమిషాల పాటు ఆలయ ద్వారాలను మూసివేస్తారు. ఇక ఆ రోజుకు సంబంధించిన చివరి హారతి రాత్రి 10 గంటలకు నిర్వహిస్తారు. శయన హారతి మొన్నటి వరకు రాత్రి 9.30 నిమిషాలకు ఉండేది. శయన హారతి ముగిసిన తర్వాత ఆ రాత్రికి ఆలయాన్ని మూసివేస్తారు.

## ఈ నెల 25న ముగియనున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియ




కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహా ప్రత్యేక కార్డులు జారీ చేస్తున్నది. ఇది వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ(భారత ప్రభుత్వం) సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు ఒక యూనిక్ కోడ్(యూసీ) కేటాయించేందుకు చర్యలు ప్రారంభించారు. మన రాష్ట్రంలో ఈ పోర్టల్ జనవరి 26వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 14 అంకెలతో కూడిన ప్రత్యేక కార్డును జారీ చేస్తుంది. ఇది రైతుకు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పేర్ల నమోదు ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి నాటికి దేశ వ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మంది రైతులకు 'భూ ఆధార్' కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు.రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పఽథకాలను ఈ యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. ఈ కోడ్ నంబర్‌ను యూనిఫైడ్ ల్యాండ్ ఏపీఐ, ఆధార్ బేస్డ్ ఆథంటికేషన్, పీఎం కిసాన్, తదితర వాటికి అనుసంధానిస్తారు. ఈ ఐడీ నంబరును ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకుతో కూడిన సేవలను పొందవచ్చును. దీని సాయంతో దేశంలో ఎక్కడైనా రుణ అర్హత, రుణ బకాయిలు ఇతర సంక్షేమ పఽథకాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. వ్యసాయ రంగంలో అన్ని సంక్షేమ పథకాలకు దీనిని తప్పనిసరి చేయనున్నారు. పండించిన పంటలకు మద్దతు ధర పొందేందుకు, మార్కెట్‌లో సులువుగా విక్రయించుకునేందుకు ఉపయోగపడుతుంది. ఎరువుల సరఫరా, లభ్యత, పంట రుణాల వివరాలు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే సత్వర పరిహారం అందుతుంది.రైతులు తమ ఆధార్ నంబరు, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలతో సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. రైతుల ఎదుటే ఆయా వివరాలను సిబ్బంది అప్‌లోడ్ చేస్తారు. రైతుల ఆధార్ నంబర్‌కు అనుసంధానమైన ఫోన్‌కు వచ్చే ఓటీపీ నంబరు చెబితే నమోదు చేస్తారు. లేదా బయోమెట్రిక్ విధానం ద్వారా కూడా నమోదు చేస్తారు. స్థానికంగా లేని రైతులు తమ గ్రామంలోని ఆర్ఎస్‌కే సిబ్బందిని ఫోన్‌లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవచ్చు.

### హెచ్ఐవీ టెస్ట్ చేయించుకున్న
## బ్రిటన్ ప్రధాని

బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ హెచ్ఐవీ పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జీ7 దేశాల నాయకుల్లో బహిరంగంగా హెచ్ఐవీ పరీక్ష చేయించుకున్న తొలి ప్రధానిగా నిలిచారు. ఈ విషయాన్ని యూకే ప్రధాన మంత్రి కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. హెచ్ఐవీ పరీక్ష వార్షికోత్సవం సందర్భంగా టెరెన్స్ హిగ్గిన్స్ ట్రస్ట్‌తో కలిసి ప్రధాన మంత్రి స్టార్మర్ ర్యాపిడ్ హోమ్ టెస్టు చేయించుకున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ పరీక్ష ఎంతో ముఖ్యమైనదని..అందులో పాల్గొనడం తనకు ఎంతో గౌరవంగా, ఆనందంగా అనిపించిందని తెలిపారు. కొన్ని క్షణాల్లో పూర్తయ్యే ఈ పరీక్షను ఒక వారం పాటు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన వెల్లడించారు. 2030 నాటికి కొత్త హెచ్ఐవీ కేసులు పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్న స్టార్మర్.. ఆ లక్ష్యాన్ని చేరేందుకు ప్రజలు ముందుకొచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.





### భారీగా పెరిగిన
## బంగారం ధరలు

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.800 పెరిగి రూ.80,600లకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రా. గోల్డ్ రేట్ రూ.870 పెరగడంతో తొలిసారి రూ.87,930లకు చేరింది. మరోవైపు వెండి ధర రూ.100 తగ్గింది. కేజీ సిల్వర్ రేటు రూ.1,06,900గా ఉంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

24 క్యారెట్ల బంగారం ధర

హైదరాబాద్‌లో 10 గ్రాముల ధర రూ.86,689
విజయవాడలో 10 గ్రాముల ధర రూ.86,695
ఢిల్లీలో10 గ్రాముల ధర రూ.86,660
ముంబైలో 10 గ్రాముల ధర రూ.86,510
వడోదరలో 10 గ్రాముల ధర రూ. 86,560
కోల్‌కతాలో 10 గ్రాముల ధర రూ.86,510
చెన్నైలో 10 గ్రాముల ధర రూ.86,660
బెంగళూరులో 10 గ్రాముల రూ.86,560
కేరళలో 10 గ్రాముల ధర రూ.86,660
పుణెలో 10 గ్రాముల ధర రూ.86,510

## రేవంత్.. చైనా ఫోన్ లాంటి పాలన నీది



తెలంగాణలో కేసీఆర్ పాలన ఐఫోన్‌లా ఉంటే.. రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్‌లా ఉందని ఎద్దేవా చేశారు ఎమ్మెల్సీ కవిత. చైనా ఫోన్ చూడటానికే బాగుంటుంది కానీ.. సరిగా పనిచేయదు. రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. అలాగే, ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారో లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదు? అని ప్రశ్నించారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ఎమ్మెల్సి కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ..'కేసీఆర్ పాలనకు, రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఎంత తేడా ఉందో ప్రజలే గమనిస్తున్నారు. మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకుని సీఎం రేవంత్ రెడ్డి బురిడీ కొట్టిస్తున్నాడు. ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారో లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదు?. తూతూ మంత్రంగా పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాలతో సమావేశం పెట్టారు. బీసీ ఉద్యమం చేస్తున్న నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడక పోవడం బీసీలను అవమానించడమే అవుతుంది. బీసీ కుల సంఘాలతో ముఖ్యమంత్రి చర్చలు జరపాలి. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదు. మరో తెలంగాణ పోరాటం తరహా పోరాటానికి బీసీలంతా సిద్ధంగా ఉండాలి. 52 శాతం బీసీలు ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారు. బీసీల సంఖ్యను తక్కువ చూపించడం శోచనీయం. ఈ తప్పుడు లెక్కలు చెప్పి రాహుల్ గాంధీ పార్లమెంట్‌ను తప్పదోవపట్టించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు ఎందుకు పెట్టడం లేదు?. ఎండిన పంటపొలాలను చూస్తుంటే కన్నీళ్లు వచ్చే పరిస్థితి ఉంది. కేసీఆర్‌పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదు. రైతులకు నీళ్లు ఇచ్చే తెలివి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలి. మహిళలను చిన్నచూపు చూస్తున్న రేవంత్ రెడ్డికి కాలం గుణపాఠం చెబుతుంది. రేవంత్ రెడ్డి తప్పులను ప్రజలు లెక్కిస్తున్నారు.. తగిన సమయంలో బుద్ధిచెబుతారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప ఎన్నిక వస్తే జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుంది' అంటూ వ్యాఖ్యలు చేశారు.

### తెలంగాణ సర్కారుపై
## హైకోర్టు మరోసారి సీరియస్



తెలంగాణ సర్కారుపై హైకోర్టు మరోసారి సీరియస్ అయింది. DSC-2008 అభ్యర్థులకు నియామక పత్రాల జాప్యంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 3న ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. అభ్యర్థులు ఏండ్ల తరబడి నిరీక్షిస్తున్నా, కోర్టు నియామకాలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ అధికారులలో కదలిక లేకపోవడం శోచనీయమని తెలిపింది. ఈ నెల 17లోపు అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.కోర్టు ఉత్తర్వులు జారీ చేసినా ఎందుకు అమలు చేయలేదని అడిగింది. కోర్టు ధిక్కరణగా పరిగణించి ఉత్తర్వులు జారీ చేయాల్సివస్తుందని, ఇలా చేస్తే మీ కెరీర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించింది. ఈ వ్యవహారంపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ ఇ.తిరుమలాదేవితో కూడిన బెంచ్ సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. డీఎస్సీ 2008కి సంబంధించి 1,382 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకున్నామన్నారు.కొంత గడువు కావాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది వాదనపై అసంతృప్తి వ్యక్తం చేసిన బెంచ్ ఉత్తర్వులు అమలుచేయకపోతే కార్యదర్శి, కమిషనర్ హాజరుకావాల్సి ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసినా అమలు చేయరా? అని నిలదీసింది. అధికారులు ఎందుకు హాజరుకాలేదని, నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు జారీ చేస్తామని హెచ్చరించింది. దీంతో మధ్యాహ్నం దాకా గడువు ఇవ్వాలని న్యాయవాది అభ్యర్థించారు.